లలో ప్రతిఫలించ గలదనడంలో సందేహం లేదు. అందుచేత, నేపాల్‌లో జరుగుతున్న కల్లోలం పట్ల ఇండియాకు సహజంగా శ్రద్ధాసక్తులు, భయాందోళనలు కలుగగలవు.

ఈ సందర్భంలో ఇండియా ప్రభుత్వం మరొక ప్రమాదకరమైన విషయాన్ని గుర్తించాలి. జాతీయ శక్తుల పట్ల సానుభూతి సుహృద్భావాలు ప్రదర్శిస్తున్న నేపాల్ రాజుకు వ్యతిరేకంగా, "క్రెమ్లిన్ ఏజంట్ల"తో కలిసి నేపాల్ ప్రధాని మేజర్ జనరల్ మోహన్ షంషేర్ జంగ్ బహదూర్ రాణా కుట్రచేస్తున్నాడని, "క్రెమ్లిన్ ఏజెంట్లు" నేపాల్‌లో ప్రవేశించి స్థావరం ఏర్పరచుకొనడానికి యత్నిస్తున్నారని వదంతులు కలవు. నేపాల్‌కు ఉత్తరంగా వున్న మన సరిహద్దు ప్రదేశం టిబెట్‌ను "క్రెమ్లిన్ కూటమి"లో నిర్బంధంగా చేర్చడానికి దానిపై దురాక్రమణ జరుగుతున్న ఈ సమయంలో ఇండియా ప్రభుత్వం యీ ప్రమాదాన్ని గుర్తుంచాలి.

ప్రస్తుతం నేపాల్‌లో వున్న రాజ్యాంగ వ్యవస్థ, పరిస్థితులు "క్రెమ్లిన్ ఏజంట్ల" ప్రచారానికి అనుకూలంగా వున్నవి. మన సరిహద్దు దేశం నేపాల్‌లో కల్లోలం కొనసాగుతున్నంతకాలం మనదేశానికి భద్రతలేదు. అందుచేత, నేపాల్‌లో కల్లోలం సమసిపోయి, అక్కడ శాంతిభద్రతలు నెలకొనడం అత్యావశ్యకం. నేపాల్‌లో కల్లోలం సమసిపోయి శాంతిభద్రతలు నెలకొనాలంటే, అక్కడ నిరంకుశ ప్రభుత్వస్థానంలో ప్రజాప్రభుత్వం స్థాపించబడితీరాలి. అందుచేత ఇండియా పై అనేక విషయాలలోఆధారపడివున్న నేపాల్ ప్రభుత్వంపై తన పలుకుబడి ప్రాబల్యాలను వినియోగించి, ఇండియా ప్రధాని పండిట్ నెహ్రూ, నేపాల్‌లో ప్రజాప్రభుత్వ స్థాపన జరిగేటట్టు కృషి చేయాలి.

రాజు, యువరాజు, ఆయన జ్యేష్ఠ కుమారుడు ఇందరు వుండగా వీరందరు సింహాసనంపై తమకుగల హక్కులకు పరిత్యజించినట్టు ప్రకటించక పోయినా, మూడు సంవత్సరాల పసికందును రాజుగా ప్రకటించడం అన్యాయం, అశాస్త్రీయం, అక్రమం. అందుచేత ఇండియా ప్రభుత్వం నూతన బాలరాజును గుర్తింపరాదు. అంతేకాక నేపాల్ రాజు కోరినా, కోరకపోయినా నేపాల్ కాంగ్రెసుచే స్థాపించబడిన ప్రజాప్రభుత్వాన్ని గుర్తించి, ప్రోత్సహించి, దాని అధికారాన్ని నేపాల్ అంతట వ్యాపింపచేయడంలో దానికి అవసరమైన సహాయాన్ని చేసి, నేపాల్‌లో సుస్థిర ప్రజాప్రభుత్వ స్థాపనకు దోహదంచేసి, తన ఈశాన్య సరిహద్దును బలీయం చేసుకొనడం ఇండియా కర్తవ్యం.

---

చిత్రమయ జగత్తు

# పిల్లి కూర్చిన ప్రణయం

## రామనాథ్

ప్రియమిత్రుడు నారాయణకు:

నేను బొంబాయి చేరి యేడాది కావస్తున్నది. యేడాదిలో అనేక సంఘటనలు జరిగాయి. అన్నిటికన్నా అతిముఖ్యమైనదీ నీకు చెప్పవలసిందీ ఒకటుంది!

మొదట ఈవూరు వచ్చి మామయ్య ఫోటో స్టూడియోలో చేరినప్పుడు యీ బస్తీ ఆడవాళ్ళవల్లో పడకూడదని శపథం చేసుకుని మరీ వచ్చాను! ఫోటోల కోసం ఎంతమంది రంభలూ, తిలోత్తమలూ వచ్చినా - వస్తూన్నా - వారిని సరిగా తేరిపార చూసే వాడినేకాదు! వారి కార్డుసైజు కావాలో, కాబినెట్ సైజు కావాలో అనేధ్యాస తప్పితే వారు బెనారస్ సిల్కుసారీ కట్టేరా కాన్పూర్ స్లిప్పర్స్ తొడిగారా అనేధ్యాస ఉండేదేకాదు!

ఈ విధంగా సిసలైన బ్రహ్మచర్యం ఏడాది నుండి అవలంబించాను. నా నిర్విరామకృషివల్ల ఫొటోగ్రఫీలోని 'కిటుకులు' చాలా గ్రహించగల్గాను. కాని... ఒక పిల్లికూన మూలంగా నా వ్రతభంగం అయ్యే సూచనలు కనిపిస్తూన్నయ్!

కాని ఆ పిల్లి కూనే నాకు ఒక అద్భుతమైన అపాయంలేని ఉపాయాన్ని సూచించింది!

జరిగిన విషయం చెబుతున్నా విను. మామయ్య ఫోటో స్టూడియో ఒకు మూడంతస్థుల మేడలో ఉంది. స్టూడియోప్రక్కనే ఒక చిన్నరూములో నా మకాం. మాది డౌను స్టోరు. మేడపైకి పోయే మెట్లు నా గదిముందునుంచి ప్రక్కగా ఉంటాయ్. మొన్న ఆదివారం నేను 'రూము'లో తీరికగా పచార్లు చేస్తూ ఆల్బం తిరగేస్తున్న సమయంలో ఒక 'బ్యూటిఫుల్ లేడీ' అపర రతీదేవిలా సాక్షాత్కరించింది మెట్లమీద! చూడగానే రతీదేవికి యిక్కడేం పని ఉంటుందా అని ఆలోచించి, బహుశా యే నర్గీసో, మధుబాలో అయివుంటుందని నిశ్చయించాను. నా చేతిలోని 'ఆల్బం' జారిపోయింది కూడా గమనించకుండా నేను నాకు తెలీకుండానే వాకిలి దగ్గరకు చేరాను కాని యీలోగానే ఆ ఒలీవియా డీ హావిలాండు వెళ్లిపోయింది మేడపైకి.

ఆ క్షణం నుంచి నాకు మతిపోయింది. ఏమీ తోచలేదు. ఇదివరకు ఆడవాళ్లంటేనే సహస్ర యోజనాలు పరుగెత్తే నా మనస్సు యిప్పుడు ఆ అమ్మాయి రతీదేవా...నర్గీసా, మధుబాలా లేక ఒలీవియా డీ హావిలాండా అని తన్నుకు చస్తోంది. నా దైనికచర్యలన్నీ బంద్ అయి నయ్. ఎందుకు? ఆ 'పిచ్చి' నన్నూ పట్టుకుందన్నమాట!

నా తెలివితేటలన్నీ ఉపయోగించి ఆవిడ పేరు మిస్ మోహిని అనీ, ఆవిడ రెండో అంతస్తులో తన అమ్మమ్మతో కలిసి ఉంటున్నదనీ భోగట్టా లాగాను! ఆవిడతో మాట్లాడాలి. దారి? ఏమని పలకరించాలి? 'రూడ్'గా ఉంటే!

దిక్కూ మొక్కూ తెలియక అంధకారంలో పడితన్నుకుంటూన్న నాకు ఒక పిల్లికూన వెలుగు చూపింది! ఒకనాడు మిస్ మోహిని మామూలుగా ఎక్కడినుంచో వచ్చి మేడపైకి పోతూంది. అప్పుడే ఒక పిల్లికూన మెట్లమీద ఆడుకుంటూ వచ్చి ఆవిడపైన దూకింది! దాన్ని ఆమె యెత్తుకుని ఆప్యాయంగా ముద్దాడుతూ పైకి తీసికెళ్ళింది! అప్పటికి చాలా రోజులనుంచి దాన్ని మెట్లమీద చూస్తూనే ఉన్నా! కాని అది ఆవిడదని తెలీలేదు!

దానికున్నంత అదృష్టమైనా లేదు కదా అని యేడుపు వస్తోంది! కానీ! ఆ పిల్లివల్ల నాకు ఒక మంచి 'ఐడియా' తట్టింది! ప్రయత్నిస్తా. వివరాలు తరువాత తెలియజేస్తా బ్రదర్. ఏదో నేనూ ఒక యింటివాణ్ణయితే!

మనవాళ్ళందరూ బాగున్నారు కదూ?

జవాబుకోసం ఎదురు చూస్తూంటా.

నీ విశ్వం.

* * *

డియర్ మిస్ మోహినీ,

మీతో ఒక విషయం చెప్పవలసి వచ్చినందుకు చాల విచారిస్తున్నాను. మీ పిల్లికూన రోజూ మా గదిలో జొరబడి పాలుతాగేసి పోతూంది! ఇందుకు తగినచర్య తీసుకుంటారని ఆశిస్తున్నాను.

మీ విశ్వాసపాత్రుడు,

సి. విశ్వనాథం,

అసిస్టెంట్, వెల్కం ఫోటోస్టూడియో.

* * *

ఆర్యా,

నా పిల్లికూన తమ యింట్లో ప్రవేశించి పాలు త్రాగినందుకు చాల విచారిస్తున్నాను. ఇకమీదట మీ తలుపులు గట్టిగా వేసుకోమని నా సలహా. పాలగిన్నెమీద పెద్దమూత పెడితే మంచిది. ఇంతవరకు మాపిల్లి త్రాగివేసిన పాల ఖరీదంతో తెలియజేస్తే పైకం పంపుతాను.

విశ్వాస పాత్రురాలు,

మిస్. మోహిని.

* * *

డియర్ మిస్ మోహినీ.

మీదగ్గర డబ్బు పుచ్చుకునే ఉద్దేశంతో లేఖ వ్రాయలేదు. పాలు త్రాగింది మీపిల్లి కాని...!

నాకో ఉపాయం తోస్తూంది. ఒకసారి మీరు శ్రమ అనుకోకుండా దాన్ని క్రిందికి తెచ్చినట్లయితే నేనొక 'స్నాప్' తీస్తాను. ఎన్లార్జిచేసి ఫోటోను పోటీ ప్రదర్శనానికి పంపుతాను. దానికి ప్రయిజు వస్తే అది పాల ఖరీదు యిచ్చుకున్నట్లే కదూ?

మీ విశ్వనాథం

డియర్ మిస్టర్ విశ్వనాథం,

వచ్చే ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు పిల్లికూనను మీగదికి తీసుకురావడానికి నాకేమీ

అభ్యంతరం లేదు. అప్పుడు టైటుకూడా బాగుంటుంది కదూ!

మిస్. మోహిని.

* * *

డియర్ మిస్. మోహినీ,

'పాలుత్రాగే పిల్లికూన' చిత్రం అద్భుతంగా తయారయింది! మీకొక కాపీ పంపుతున్నా. దాన్ని ఎన్‌లార్జి చేస్తున్నాను.

మొన్న మీరు చెప్పినట్లు... మీరు గరల్స్ స్కూల్లో కుట్టుపని ఉపాధ్యాయినులు కాబట్టి 'అల్లిక కళ' అనే ఒక చిత్రాన్ని తయారు చేయాలని కుతూహలంగా ఉంది. మీలో కళా సౌందర్యం ఉట్టిపడుతూంటుంది. మీరు అల్లిక పనిలో ఉంటే ఒక 'క్లోజప్' తీయాలని చాలా ఆరాటంగా ఉంది. మీరు సహకరిస్తే అది అత్యద్భుతంగా తయారవుతుందనడానికి సందేహం లేదు... ఏమంటారు?

దీనికి 'స్టూడియో లైటింగ్' కావాలి ... శ్రమ అనుకోకుండా ఒకసారి మా స్టూడియోకి దయచేస్తే... చాలా సంతోషిస్తాను.

మీ విశ్వం.

* * *

ప్రియమిత్రుడు నారాయణకు:

నా కన్న అదృష్టవంతుడైన ఫోటోగ్రాఫరు యీ ప్రపంచంలో ఉండడు!... మిస్. మోహినీ-తాడ పిల్లికూన విషయం యిదివరకు వ్రాశాను గుర్తుందా? నా 'ఐడియా' అద్భుతంగా పని చేసింది. మిస్. మోహిని సహకారంతో 'అల్లికళ' అనే ఫోటో తీశాను. ఫోటో ప్రదర్శనాల్లో 'వెండి పతకం' వచ్చింది. 'పాలు త్రాగే పిల్లి' అనే యింకో చిత్రానికి సెకండ్ ప్రయిజ్ వచ్చింది! ఈ దెబ్బతో నా పేరు సిటీ అంతా మారు మ్రోగుతూంది! 'హిందూస్తాన్ స్టూడియోస్' వారు పెద్ద 'జీతం'మీద నన్నాహ్వానిస్తున్నారు. దానిలో చేరబోతున్నాను... నా పెళ్లికూడా పైకం అవసరం.

ఆశ్చర్యంగా ఉందా? ... అవును... నేనూ మిస్ మోహినీ పెళ్ళి చేసుకోబోతూన్నాం. ఆవిడ తన బంధువు లింటికి వెళ్ళింది. రాగానే వివాహం జరుగబోతూంది. రావటం మరచి పోవు కదూ. తప్పక రావాలిసుమా?

అయినా ఒకవిషయం నన్ను బాధిస్తోంది... మోహినితో పిల్లికూన నా పాలు త్రాగేసిందని అబద్ధమాడి మోసంచేశానే అని! ఇప్పుడే తప్పు ఒప్పుకుంటూ మోహినికి వ్రాస్తున్నాను. ఆవిడకు కోపం రాదులే. వచ్చినా - 'ఆ అబద్ధమే మన వివాహానికి మూలమని' చెప్పి ఒప్పిస్తా.

మన వాళ్ళందరికీ శుభలేఖలు పంపుతున్నా.

నీ విశ్వం.

* * *

మిస్టర్ విశ్వం,

మీ ఉత్తరం ఒక షాక్‌లా తగిలింది. ఇంత పచ్చిఅబద్ధాలు ఆడుతారని తెలీలేదు. నాతో పరిచయానికి పాపం ఆ అమాయక పిల్లికూన మీద ఘోరాపనింద వేస్తారా? మీ విషయం ఆలోచించాలి. నేను వచ్చిన తరువాత వ్యవహారం తేల్చుకుందాం.

మిస్. మోహిని.

* * *

వెంకట్రావ్,

విశ్వం పెళ్ళికి రాలేకపోయినందుకు నీవు దురదృష్టవంతుడివి. నా అదృష్టంకొద్దీ సెలవు దొరకింది. పెళ్ళిలో తీసిన గ్రూపు ఫోటో ఒకటి పంపుతున్నా.

పాపం విశ్వం మోహినిని ఒప్పించడానికి యెంత తంటాలు పడ్డాడనుకున్నావ్! పిల్లికూన వాడి 'రూం'లో పాలు త్రాగిందని అబద్ధం ఆడాడుగమా. ఇంకెన్నడూ అబద్ధం ఆడనని ఒట్టేసుకుని శపథం చేశాడు. అందాకా ఆవిడ శాంతించలేదు!

పెళ్ళి అద్భుతంగా జరిగింది. పేరుపడ్డ ఆర్టిస్టులూ ఫోటోగ్రాఫర్లూ చాలమందివచ్చారు. అందరికీ ఫైన్ డిన్నర్ జరిగింది. 'సూపర్ విజన్' మనమే లే!

వారిద్దరూ 'హనీమూన్'కి వెళ్తున్నారు. టాక్సీలో కూచుని బయల్దేర బోతూండగా దీని కంతటికీ కారణం అయిన పిల్లికూనను పట్టుకుని నేను పరుగెత్తుకుంటూ వచ్చాను.

'అరే! అసలు దాన్ని మరచి పోయామే! దీన్నికూడా తీసుకు పోవాలి' అంటూ విశ్వం ఒళ్లో కూచోపెట్టుకున్నాడు.

'అబ్బే! దాన్ని మనమెలా తీసుకుపోతాం!' అన్నది మోహిని.

'ఏం? అదేగా మనకీ పెళ్ళి చేసింది!' అన్నాడు విశ్వం పిల్లికూన తలదువ్వుతూ!

'కావచ్చు. అయితే అది మనది కాదు. ప్లీడరుగారిది.'

'ఆ ఇంతకీ ఇది నీపిల్లి కాదూ?' అని అరిచాడు విశ్వం కప్పలా నోరు తెరిచి! అప్పుడు వా 'ఫేస్' చూస్తే 'జీవితం'లో రామచంద్రన్ జ్ఞాపక మొచ్చాడు.

పాపం! పిల్లికూనను అక్కడే విడిచిపెట్టి వారు వెళ్లిపోయారు! నేనూ యివ్వాళే బయలుదేరుతున్నా.

వి నారాయణ.

# కాశ్మీరు భూసంస్కరణలు

కాశ్మీరులో భూ సంస్కరణలు నవంబరు 1వ తారీకున మొదలయినట్లు, మతిపుర అనే గ్రామమందు షేక్ అబ్దుల్లా తానే స్వయంగా 1312 ఎకరములు అక్కడి రైతులకు పంపిణి చేసినట్లు వార్తాపత్రికల ద్వారా తెలుస్తున్నది. జూలై 13వ తారీకున నష్టపరిహారము లేకుండ జమీందారులను రద్దుచేస్తామని షేక్ అబ్దుల్లా ప్రకటించిన తరువాత ఢిల్లీ వర్గాలలో కొంతఅలజడి కలిగిందనీ, సంస్కరణలు ఆపుకొవచ్చనీ కొన్ని వార్తలు బయలు దేరినవి. కాని షేక్ అబ్దుల్లా మాత్రము తన పనిని స క్ర మం గా సాగిస్తున్నాడు.

యీ సంస్కరణల ద్వారా ప్రతి ఒక్క కుటుంబమునకు 22ఎకరాల ప్రకారము 50,000 కుటుంబాలు ఆర్థికంగా స్వయం పోషకత్వ మవుతాయి. యీ చట్టప్రకారం ఎవ్వరి భూమిని వారేసాగుబడి చేయవలెను. నష్టపరిహార విషయం మాత్రం స్టేట్ అసెంబ్లీ తీర్మానిస్తుంది. ఈ రైతులంతా సామాన్యపు పన్ను చెల్లించడమేగాక 25ం/ం ఎక్కువగా చెల్లించవలెను. ఆ "ఎక్కువ పన్ను"ను ప్రభుత్వము వ్యవసాయాభి వృద్ధి కొరకే వినియోగిస్తుంది. మొత్తం మంతా కలిసినా యిదివరలో భూస్వాములకు చెల్లించే పన్నుకన్నా చాలా తక్కువ. యిప్పటి కార్యక్రమం ప్రకారం జమీందారీల పంపకమంతా మూడు మాసాలలో పూర్తి అవుతుంది. వందల కొలది సంవత్సరాలనుండి రైతులను ఆర్థికంగా బానిసలుగా జేసి బాగా బలిసిన భూస్వాములకందరికీ స్వస్తి.

యిప్పుడు ప్రతిరైతు స్వతంత్రుడయినందున యిదివరలోకన్న యెక్కువ శ్రమ చేస్తాడు. దానికి తోడు ప్రభుత్వముగూడ సహకరిస్తే ధాన్యపు ఉత్పత్తి యెక్కువవుతుంది. యిది ఆర్థిక లాభం మాత్రమే. రాజకీయంగా పాకిస్తాన్ ఆక్రమించిన పూంచ్ మొదలగు జిల్లాలలో రైతులంతా ఆందోళన చేయక తప్పరు.

మన పొరుగువాళ్లు యీ ప్రకారంగా - పురోగమిస్తూంటే, మద్రాసు, ఉత్తర ప్రదేశ్, బీహార్ మొదలగు ప్రాంతములలో యింకా నష్టపరిహార, సమస్యనే చర్చిస్తున్నారు. అన్ని ప్రాంతాలకు కలిసి నష్టపరిహారము, సుమారు 414 కోట్లు రూపాయలవుతుంది. అందువలన యిప్పుడు జమీందారీలను రద్దుచేయుట వీలుకాదని మన నాయకులు చెప్పుతూ వచ్చారు. ఉత్తర ప్రదేశ్, ప్రాంతములో మాత్రము నష్టపరిహారాన్ని రైతులనుండి వసూలు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. యిదేగనుక కొనసాగితే దీని వల్ల రైతులు అప్పులపాలు గాక తప్పరు. నష్టపరిహార మివ్వకుండా జమీందారీలను రద్దుచేయటం న్యాయంకాదా? వందలకొలది సంవత్సరాలనుండి రైతుల శ్రమనుండి వచ్చిన ఐశ్వర్యముతో వినోదాలను అనుభవించిన యీ జమీందారులకు మళ్లీ నష్టపరిహార మివ్వవలసిన అవసరమేముంది? చివరకు వ్యవసాయపు పన్ను విధించుటకు గూడ సమయము కాదని ప్రాంతీయ ప్రభుత్వాలు నిరాకరించినవి.

భూమి సంస్కరణ ద్వారా (వన మహోత్సవాలద్వారా గాదు) ఆహార సమస్య చాలా వరకు పరిష్కరింప పడుతుంది. యిటువంటి విషయాలలో - ప్రభుత్వము అజాగ్రత చేసినట్లయితే విప్లవానికి దారితీసిన వారవుతారు.

—జి. లక్ష్మణస్వామి